# వెల్ డన్!!!

రాయప్రోలు హైమ

అదొక జల — విద్యుత్‌శాఖ ఉద్యోగస్థులు నివసించే కాలనీ. మిగతా రాష్ట్రంతో సంబంధంలేకుండా ఎక్కడో అడవిలో విసిరేసినట్లున్న ప్రాజెక్టేఅయినా... జల... మరియు విద్యుత్‌శాఖకదా! జగజ్జగాయమానంగా వెలిగిపోతోంది.

'ఏ' టైప్, 'బి' టైప్, 'సి' టైప్, ఏవన్, బివన్, సివన్... ఇత్యాది రకరకాల క్వార్టర్సు. అన్నిట్లోనూ ట్యూబ్‌లైట్లే... వీధిల్లో, పెరట్లో... బాత్‌రూమ్స్‌లో... వంటింట్లో... పుష్కలంగా, ఇరవైనాలుగ్గంటలూ నీరుజిమ్మే పంపులు... ఆడపిల్లల హైస్కూలు... మగపిల్లల హైస్కూలు... లేడీస్‌క్లబ్... జెంట్స్ అసోసియేషన్... బాలానంద సంఘం...టెన్నిస్ కోర్టు... క్రికెట్ పిచ్.. ఆడిటోరియం... ఒకటేమిటి... ఆ వైభవం... ఆ హడావుడి వర్ణించలేం. రోజంతా సందడే— ఏటి పొడుగునా హుషారూ...ఏమొచ్చినా ఇహ ఆ కాలనీలో జనాన్ని పట్టలేం. రకరకాల సరదాలు జరుపుకుంటారు. కష్టాలు... సుఖాలు పంచుకుంటారు. గొప్పలు ప్రదర్శించడంలో పోటీ పడతారు. 'కొత్త' అన్నది ఏదయినాసరే తామే ముందుగా అందుకోవాలని అర్రులు చాస్తారు.

అలాంటి ఆ కాలనీలో ఒక కొత్త ప్రాణి అడుగుపెట్టేడు. మోహన్‌క్రిష్ణ, చురుకైనవాడు. చూపరి. ముప్ఫైఏరెండేళ్ల బిగుతు ప్రాయంలో ఉన్నాడు. బ్రహ్మచారి వచ్చీరాగానే క్రికెట్ క్లబ్ మెంబరయిపోయేడు, యంగ్‌మెన్స్ అసోసియేషన్లో జేరేడు. డ్రమెటిక్స్ అండ్ కల్చరల్‌వింగ్ విజిట్ చేసేడు. మీదు మిక్కిలి, ఆడామగా పిన్నాపెద్దా అందరి మనసుల్లోనూ మెదిలిపోవడం మొదలు పెట్టేడు.

పొట్టి స్కర్టులు — వదులు షర్టులు వేసుకునే హైస్కూలు పాపలు "అంకుల్"ని చూసి సరదాపడ్డారు. క్రికెట్ మోజులోఉన్న కుర్ర అతన్ని "హీరోవర్షిప్" చెయ్యడం మొదలు పెట్టేరు. లేడీస్‌క్లబ్‌లో కూర్చునే నడివయస్సు ఆడవాళ్ళు అతని 'వయస్సు' అంచనా కట్టడం మొదలుపెట్టేరు.

ఆడపిల్లల తండ్రులయిన ముసలి ఏ.యీ.లు, అన్నలయిన కుర్ర జే.యీ.లు మోహన్‌క్రిష్ణ కులం—గోత్రం, ప్రవర ఇత్యాదుల వివరాలు సేకరించబట్టేరు.

సూపరింటెండెంటు ఇంజనీరు సుబ్బరామయ్యగార్కి మోహన్‌క్రిష్ణతో నేస్తం బాగా కుదిరింది. ఆయనకి అతని కులంతో కులం, గోత్రంతో గోత్రం, సరిగ్గా అతికినట్లు సరిపోయేయి. కుర్రాణ్ణి నెమ్మదిగా దువ్వి పని సాధించుకోవాలని ఉబలాటపడ్డారు. తదనుగుణంగా ఆరోజు అతనికి ప్రత్యేకమయిన విందు ఏర్పాటు చేసేరు.

సందర్భం లేకపోలేదు. ప్రాజెక్ట్ ఎంప్లాయీస్ క్లబ్‌వారి మధ్య వార్షిక సాంస్కృతికోత్సవాలు నిర్వహించేరు. డ్రామాలు,డాన్సులు, కవి సమ్మేళనాలే కాకుండా... ఇన్‌డోర్, అవుట్‌డోర్ గేమ్స్ మరియు స్పోర్ట్సులో కూడా పోటీలు జరిగాయి. మొన్న మొన్న వచ్చిన మోహన్‌క్రిష్ణ అడ్డులేకుండా "షైన్" అయిపోయేడు. డ్రామాల్లో 'బెస్ట్ ఆక్టర్' అనిపించుకున్నాడు. డిస్కోడాన్సు చేసి ప్రేక్షకుల్లో ఒక రకమైన "ఊపు" తెప్పించేడు. షటిల్‌మిక్సెడ్ డబుల్స్ ఆడి తన టీమ్‌కి ప్రైజు తెప్పించేడు. అన్నిటికంటె గొప్ప విషయం గత ఆరేళ్లుగా అడ్డులేకుండా 'చెస్‌ఛాంపియన్'గా కొనసాగుతూ వచ్చిన సుబ్బరామయ్యగార్ని చిత్తుగా కట్టేసి "ఛాంపియన్ షిప్" తీసుకున్నాడు. సుబ్బరామయ్యగారు ఓటమిని హుందాగా స్వీకరించేరు. విజేతకి విందు ఏర్పాటు చేసేరు.

తనతోపాటు మరింత మంది ఏ. యీ.లనీ, జే. యీ. లనీ... ఇంకా...ప్రాజెక్టు వి.ఐ.పీ. లనీ విందుకు పిలుస్తాడనుకున్నాడు మోహన్. బెస్టు డ్రెస్ వేసుకుని ట్రిమ్ముగా తయారయి . అందర్నీ అలరించాలి అనుకున్నాడు.

"అబ్బే! అలాంటిదేం ఉండదు. సుబ్బరామయ్యగారు పది మందికి విందు చేసే బాపతు కాదు" అన్నాడు రఘు చెస్ కాయిన్స్ తీసి టిన్‌లో పడేస్తూ.

"అంటే" టై కట్టుకుంటున్నవాడల్లా ఆగిపోయి రఘు కేసి చూసేడు మోహన్.

రఘు అర్థవంతంగా నవ్వేడు. లలల లలల లలల్లా ... చిన్న ట్యూన్ ఒకటి హమ్ చేసేడు చెస్ కాయిన్స్ ఎగరేస్తూ పట్టుకుంటూ ఆట మొదలు పెట్టేడు.

పిచ్చివేషాలు మాని చెప్పదల్చుకున్నదేదో సూటిగా చెప్పు ... గద్దించేడు మోహన్.

రఘు వెర్రి మొహం పెట్టేడు మోహన్ గద్దింపుకి. చూపులు దించేసి హమ్మింగ్ మానేసేడు.

మోహన్‌కి జాలేసింది, "పాపం చంటి" అనుకున్నాడు. రఘు అవటానికి మోహన్ జేయీచేస్తున్న సెక్షన్‌లోనే 'ఎల్డీసీ' చేస్తున్నా అతన్నెవరూ "మీరు" అని మన్నించరు. మొదట్లో ... అతను ఆఫీసులో అందరిలోకీ చిన్నవాడు కావటాన అలా పిలుస్తున్నారేమో. అనుకున్నాడు. కాని ఫోర్తుక్లాసు ఎంప్లాయీస్ కూడా 'చంటి బాబూ" 'నువ్వు' అంటుంటే విషయం ఏమిటా అని 'ఆరా' తీసేడు.

రఘువాళ్ల నాన్న రామక్రిష్ణ... ఇదే ఆఫీసులో సెక్షన్ హెడ్‌గా పనిచేస్తూ ఒక దుర్దినాన ఆఫీసులో కూర్చున్నవాడుకూర్చున్నట్లే గుండెపోటు వచ్చి చచ్చిపోయేడు. అప్పుడు బి. కాం. ఫైనలియర్ చదువుతున్నాడు చంటి ఉరఫ్ రఘురామ్. అతనే ఇంటికి పెద్ద, వెనక ఇద్దరు చెల్లాయిలు ఒక తమ్ముడు ఉన్నారు. వరసగా జూనియర్ కాలేజ్, హైస్కూలు, ఎలిమెంటరీ స్కూల్సులో చదువుతున్నారు రామకృష్ణ నిక్కచ్చి అయిన ఆఫీసరు. పైసా లంచం పుచ్చుకోలేదు. పగలు రాత్రి కష్టపడి పనిచేసేడు. రఘురామ్ ఆస్తిపాస్తులు మిగల్చక పోయి సర్వీసులో వుండగా చచ్చిపోయినందున అదే సెక్షన్‌లో ఎల్డీసీ పోస్టు దొరికింది. తల్లికి ఏర్పాటు చెయ్యబడిన విడో పెన్షన్. తమ్ముడికి చెల్లాయికి లభించే మైనర్ గ్రాంటు... అతని జీతంతో ఏదో కాలక్షేపం అయిపోతోంది. 'బి' టైప్ క్వార్టర్సు నుంచి 'సి'కి మారేరు. సుబ్బరామయ్యగారే పూనుకుని రఘుకి ఉద్యోగం— ఆ కుటుంబానికి పెన్షన్ రావడం ఆలస్యం కాకుండా చూసేరు. రఘు జీతం తీసుకెళ్లి తల్లి చేతిలో పోస్తాడు. తను నిర్వ్యాచీగా ఆఫీస్‌కాగానే క్రికెట్ ఆడుకుంటూ తిరుగుతాడు.


రఘు కథ విన్నాక మోహన్‌కి అతని మీద చాలా జాలివేసింది. ముక్కుపచ్చలారని కుర్రాడు. మీసాలు షేవ్ చేసుకోవటం కూడా రాదు. నున్న బుగ్గలింకా గరుకు తేలనే లేదు, నిన్నటిదాకా 'పోర్షియా' వేషం వేసి ఇప్పుడిప్పుడే ప్రిన్స్‌హేమ్లెట్ వేషం వెయ్యబోతున్న షేక్స్పియర్ హీరో లాగ సిగ్గుగా —చిలిపిగా.. లేతగా ఉన్నాడు. ఇతన్ని తన వెంట తిప్పుకుని తన విద్యలన్నీ నేర్పి కాకలుతీరిన మగరాయుడిలాగ చెయ్యాలి.

సరేకాని ...రఘూ...ఇంకెవర్నీ పిలవకుండా నా ఒక్కడికే ఎందుకోయ్ విందు...బిక్కమొహం పెట్టిన రఘుని అనునయిస్తూ అడిగేడు మోహన్.

అక్కడే ఉంది అసలు రహస్యం. వాళ్లింట్లో ఓ అందమయిన అమ్మాయుంది ... ఊరించేడు రఘు మోహన్‌ని.

"అమ్మాయా! ఎవరు...ఆ అన్‌ఫార్చునేట్ బ్యూటిఫుల్ యంగ్ విడోనా ... " గిరీశంలా అద్దంలో చూసుకుంటూ క్రాపు సరిచేసుకున్నాడు మోహన్.

ఆ అన్‌ఫార్చునేట్ బ్యూటిఫుల్ యంగ్ విడో సుబ్బరామయ్యగారి పెద్దకోడలు మాలతి. ఆయన చెల్లెలి కూతురేను. తండ్రి చిన్నతనం లోనే చనిపోగా...తల్లే సర్వస్వం అయి మాలతిని పెంచింది. అమలాపురంలో ఉన్న పదెకరాల కొబ్బరితోట, పెంకుటి లోగిలి దాయాదులకి పోకుండా స్వయంగా కాపాడుకుంటూ బిడ్డని చదివించుకుంది. ఎండనక వాన అనక పొలాల వెంటపడి తిరుగుతూ, ఏళ్లతరబడి వ్యవసాయం చేయించిందేమో ఆవిడ ఆరోగ్యం పాడయింది. లెక్కచెయ్యకుండా వ్యాధి ముదరబెట్టేసుకుంది. చివరకి కన్నుమూసేటప్పుడు, కన్నకూతుర్నీ ఉన్న సంపదనీ అన్నగారైన సుబ్బరామయ్య చేతిలో పెట్టేసింది. అప్పటికి మాలతి ఆంధ్రా



'ఉత్తరాలు' శీర్షికకి
రాసేవారు

తమపేరు, పూర్తి చిరునామా
తెలుగు లిపిలో రాయాలని
మనవి చేస్తున్నాము.

—సంపాదకుడు.

ఫొటోగ్రఫీ, కలర్ ఫొటోగ్రఫీ
మరియు స్క్రీన్ ప్రింటింగ్
మీ ఉజ్వల భవిష్యత్కై పై మూడు కళలను పూర్తి సాంకేతిక విజ్ఞానాన్ని ఇంటివద్దనుంచే ఇంగ్లీషు లేదా హిందీ లేదాతమిళంలో నేర్చుకొనండి. ప్రాస్పెక్టసు కోరువారు వ్రాయండి.

**KALAIMATHI NILAYAM**
Nanjai thalaiyur
P O. 639 204. Tamilnadu.

**హిప్నాటిజం నేర్చుకోనండి !**
పోష్టుద్వారా హిప్నటిజం నేర్చుకుని త్రాగుడు మొ. దురభ్యాసములు మానండి! మాన్పించండి.
వివరములకు 55 పై. కవరు పంపండి.
**డా॥ వి. సత్యనారాయణ,**
ఇంటియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హిప్నాటిజం,
టాకీస్టాండువద్ద; గుడివాడ—521301.

**Now Available in 2 MODELS**
Lady Chum
WASHING MACHINE


FIBRE GLASS TANK With 2 YEARS GUARANTEE
Authorised main Dealer
innovations
Phone 64024
CHALLAPALLIBANGALOW SITE VIJAYAWADA 520002

# వెల్ డన్

యూనివర్సిటీలో ఎమ్మే ఫైనలియర్ చదువుతోంది. చనిపోయిన తల్లి నిర్ణయం ప్రకారం మామయ్య పెద్దకొడుకు డాక్టర్ గోపాల్‌ని పెళ్ళాడింది. రెండేళ్ళు కాపురం చేసింది.

గోపాల్ తండ్రి ప్రోద్బలం మీద గల్ఫ్ కంట్రీస్ వెడుతూ విమాన ప్రమాదంలో చచ్చిపోయేడు.

మాలతి కష్టాలకి అలవాటు పడిపోయింది. ఏడ్చినన్నాళ్ళు ఏడ్చి గంభీరంగా ఇంటి బాధ్యత నెత్తిన వేసుకుంది. సుబ్బరామయ్యగారి భార్య రోగిష్టిది. ఆడపడుచుల పురుళ్ళ రాకపోకలు, వేరే ఊళ్ళల్లో ఉద్యోగాలు చేసుకుంటున్న మరుదులకి ఆవకాయలు అందించడాలు, మంచంలో అత్తగారి సంరక్షణ, ఆఖరి ఆడబడుచు రాధ బాధ్యత ... స్వీకరించి గత అయిదారేళ్ళుగా ఆ కుటుంబానికి పెద్ద అండగా నిలబడింది ... మాలతి.

"ఆవిడ గురించి కాదు నేను చెప్పేది! సుబ్బరామయ్యగారి అమ్మాయి రాధ" నీళ్ళు నమిలేడు రఘు.

"బావుంటుందా ?" ఊరిస్తున్నట్లుగా కొంటెగా చూసేడు మోహన్.

"చాలా అందంగా ఉంటుంది! ఆ రోజు లైట్ మ్యూజిక్ పోటీలప్పుడు "నన్నిడిసి పెట్టెల్లినాడే" పాడలా . ఆ అమ్మాయి" రఘు లేచి నిలబడ్డాడు వెళ్ళిపోడానికి ఉద్యుక్తుడవుతూ.

"ఓహో ! నేను సరిగ్గా చూళ్ళేదులే..." ఇంటికి తాళం పెట్టేడు మోహన్. ఇద్దరూ కలసి కాంపౌండు దాటి రోడ్డెక్కేరు. వంద గజాలు మౌనంగా నడిచేరు. మళ్ళీ రఘు అన్నాడు —

"కాని రాధ మీ కంటె చాలా చిన్నది, నా క్లాస్‌మేట్" ఆ మాటలంటుంటే అతని కళ్ళు చెమర్చేయి. గొంతు ఆర్ద్రమయింది. రోడ్డు మలుపు రాగానే ఇద్దరూ చెరోదారి పట్టేరు.

*　　*　　*

సుబ్బరామయ్య విందుకి మరి ఇద్దరు ముసలి ఏ. ఓ.లనీ, ఒక కుర్ర జే. ఓ.నికూడా పిల్చేరు. అయితే వాళ్ళెవరూ కూడా సుబ్బరామయ్యగారి కులపువాళ్ళు కారు.

డాబామీద షామియానా క్రింద డిమ్ లైటింగ్ ... లైట్ ఇన్‌స్ట్రుమెంటల్ మ్యూజిక్ ... అందమైన డైనింగ్ టేబుల్‌మీద అందమైన క్రోకరీ ... సుబ్బరామయ్యగారి రెండో కొడుకు రాజా...మోహన్‌క్రిష్ణ పక్కనే కూర్చున్నాడు. మిగతా ఏ.ఓ.లు, జే.ఓ. కూడా భార్యలతో సహా వచ్చేరు. సుబ్బరామయ్యగారి రోగిష్టి భార్య మూల్గుతూ...ముక్కుతూ దూరంగా కుర్చీలో కూర్చుంది "నాకు పథ్యమండీ! ఈ వంట తినకూడదు ..." అంటూ.

విందు కోలాహలంగా కొనసాగిపోతోంది. మాలతి, రాధ వడ్డన చేస్తున్నారు. "మరికొంచెం వెజిటేబుల్ పలావు తినవయ్యా... కుర్రాళ్ళు మీరు తినకపోతే మేం తినగలమా..." తెగ బలవంతం చేసేరు సుబ్బరామయ్యగారు మోహన్‌ని. "అమ్మా రాధా... ఆ హల్వా ఇలా మోహన్‌కి వడ్డించు..." సమయం కనిపెట్టి రాధని పరిచయం చేసేరు.

"మా ఆఖరి అమ్మాయి రాధాసుందరి, బి. కాం. పాసయ్యింది. వీణ వాయిస్తుంది. ఈ పిల్ల పెళ్లి ఒక్కటీ చేసేస్తే నేను తెమిలిపోయినట్లే... హహహ..." అట్టహాసంగా నవ్వేరాయన. అందరూ శృతి కలిపేరు.

మోహన్ రాధకేసి చూసేడు. బంగారుతీగ. చెరకుగెడలా సన్నగా పొడవుగా సౌకుమార్యంగా ఉంది. లంగా వోణీ వేసుకుంది. రెండు పొడవాటి జడలు వీపుమీద జీరాడుతున్నాయి. పెద్ద పెద్ద కాటుక కళ్లలో భయం అమాయకత్వం కొట్టొచ్చినట్లు కనబడుతున్నాయి. మూర్తీభవించిన ముగ్ధత్వంలా ఉంది. "చంటిది" అనుకున్నాడు మోహన్.

అతను కన్నార్పకుండా రాధకేసి చూడ్డం చూసి ఆనందంగా నిట్టూర్చేరు సుబ్బరామయ్యగారు. "హాఫ్ ది బేటిల్ ఈజ్ వన్" అనుకుంటూ !

భోజనాలు ముగించి డాబా దిగి కాంపౌండులో కుర్చీలేసుకుని కూర్చున్నారు మగవాళ్ళు. ఆడవాళ్ళు లోపలేదో తంటాలు పడుతున్నారు కొత్త రకాల చీరలు చూసుకుంటూ.

నెమ్మదిగా అసలు విషయాని కొచ్చేరు సుబ్బరామయ్యగారు.

"రాధని చూసేవుగా! మీకూ మాకూ గోత్రాలు — ఋషులు చక్కగా కుదిరినట్టే, మరి నువ్వు ఆలోచించుకుని నీ అభిప్రాయం చెపితే మీ పెద్దవాళ్ల దగ్గరకి వెడతాం." నలుగురు పెద్దమనుషులుండగా తను సంబంధం కదలేస్తే... కాలనీలో మరెవరూ పోటీ రాకుండా వీళ్ళు చూస్తారు. సుబ్బరామయ్యగారు తెలివి తక్కువవాడేం కాదు.

మోహన్ కొంచెంసేపేం మాట్లాడలేదు. మొహంలో ప్రసన్నత అలాగే ఉంది. కుర్చీలో 'రిలాక్సింగ్'గా ఊగుతూ 'చూద్దాం' అన్నాడు. అతని నుంచి ఎలాంటి మాటొస్తుందో తెలియక తికమక పడుతున్న సుబ్బరామయ్యగారు "అమ్మయ్య" అనుకున్నారు.

"టేక్ యువర్ ఓన్ టయిమ్" అని ఆయనంటుండగా "మామయ్యా వక్కపొడి ఇదిగో" అంటూ మాలతి వచ్చి వక్కపొడి డబ్బా అందించింది.

"మోహన్ ! మాలతిని పరిచయం చెయ్యలేదుగా ! మా పెద్దకోడలు, ఎమ్మే...సైకాలజీ ఫస్టుక్లాసు... దాని ఖర్మ... నా ఖర్మ ఇలా కాలి

పోయింది కాబట్టి కానీ ... ఈపాటికి ముగ్గురు పిల్లల తల్లి కావాల్సిందే," సుబ్బరామయ్యగారి కళ్ళు చెమర్చేయి. గొంతు గద్గదమయింది. "నా పెద్దకొడుకే ఉంటేనా ..." ఇంకా ఏదో చెప్పబోయేడాయన.

"ఊరుకో మామయ్యా !" వారించింది మాలతి.

"నువ్వే అలా ఢీలాపడిపోతావేమిటి మాటి మాటికీనూ ! పరిస్థితులలో మార్పులొస్తుంటాయి. గంభీరంగా ఎదుర్కోవడమే" వక్కపొడి డబ్బా టీపాయ్ మీదుంచుతున్న మాలతికేసి చూసేడు మోహన్‌క్రిష్ణ. పెద్ద కళ్ళు ఆమె గుండె లోతుల్ని చాటుతున్నాయి. విల్లు వంటి కనుబొమ్మలు. కోటేరేసిన ముక్కు, తీర్చి దిద్దినట్టున్న రూపురేఖలు ... కొండపల్లి బొమ్మని తలపిస్తోంది. విశాలమైన ఫాలభాగం బొట్టులేక బోసి కొడ్తూ ఉంది. వక్కపొడి ఉంచేసి టేప్ రికార్డర్ ఆన్ చేసి లోపలికి నడిచింది మాలతి. ఆమె గడపదాటి లోపల అడుగు పెట్టేదాకా ఆమె వెంట ఆమె జలపాతంవంటి జడ వెంట వెళ్ళేయి మోహన్ చూపులు.

"ఏమి హుందాతనం" అనుకున్నాడామె గురించి.

* * *

నేను చెప్పినవన్నీ జరిగిందా ! మీకు రాధని ప్రపోజ్ చేసేరా ! . మర్నాడు ఆఫీసు పని పూర్తయ్యేక క్వార్టర్స్ వేపు నడుస్తూ రఘు అన్నాడు మోహన్‌తో.

"ఊఁ !" ముక్తసరిగా అని ఊరుకున్నాడు మోహన్.

"మీరేమన్నారు ?"

"చూద్దాం" అన్నాను.

మీకు నచ్చిందా ... ఆత్రంగా అడిగేడు రఘు !

"ఆహాఁ: బ్రహ్మాండంగా !... కొండపల్లి బొమ్మలాగుంది !" ... మరి ప్రశ్నించలేదు రఘు. కొంచెం దూరం ఇద్దరూ మౌనంగా నడిచేరు.

రఘు వాళ్ళింటివేపు తిరిగే రోడ్డురాగానే "వెడతాను" అన్నాడు, ఇద్దరూ ప్రతీరోజూ మోహన్ ఇంటికి రావడం... కాఫీ త్రాగడం... షటిల్‌కోర్టుకో, బాడ్మింటన్ కోర్టుకో వెళ్ళడం అలవాటు. ఈ రోజు ఇంటికే వెడతానంటున్నాడు.

"ఏం ! నాతో వచ్చేయ్ !..."

"రాను..."

"అయితే ఇంటికివెళ్ళి అట్నుంచే గ్రౌండ్స్‌కి వస్తావా ..."

"ఊహూ !" మరి మోహన్‌కేసి చూడకుండా చకచకా నడిచి వెళ్ళిపోయేడు రఘు.

మోహన్ మామూలుగా గ్రౌండ్స్‌కి వెళ్ళేడు. ఆడి, అలసిపోయి ఇంటికొచ్చి రాజమ్మ కాచియిచ్చిన వేణ్ణీళ్లతో స్నానంచేసి, తల నున్నగా దువ్వుకుని పూలరంగడిలాగా ... పూలలుంగీ కట్టేడు. బెంగాలీ లాల్చీ తొడిగేడు. రేడియో పెట్టి "వివా" సిప్ చేస్తూ కుర్చీలో కూర్చోబోతుంటే కాలింగ్ బెల్ మ్రోగింది.

తలుపు తియ్యడానికి రాజమ్మలేదు. వంట చేసి టేబిల్‌మీద సర్దేసి వెళ్ళిపోయింది. తనే లేచి తలుపు తీసేడు, "రఘు వచ్చిఉంటాడు ! తిక్కతిరిగి ఉంటుంది"...

కాని ఆశ్చర్యం ! ఎదురు మాలతీ, తెల్లటి వెంకటగిరి చీర కట్టుకుని కొంగునిండుగా కప్పుకుని చెరగని చిరునవ్వుతో గుమ్మంలో నిలబడింది.

"నమస్తే" అంది మృదువుగా !

"ప్లీజ్ కమిన్" ఆహ్వానించేడు. లోపలికి వచ్చింది. కుర్చీ చూపించేడు, కూర్చుంది. కొన్ని క్షణాలు ఎవరూ పెదవి విప్పలేదు.

"నేనిలా రావడం వింతగా ఉందనుకుంటా. అంత బాగుండదుకూడా అనుకోండి..." అంది మాలతి. ఎట్టకేలకు 'అనీజీ'గా నసుగుతూ, మోహన్ నవ్వేడు. కాస్సేపు మాలతికేసి కన్నార్పకుండా చూసేడు. తర్వాత చేతిలో ఉన్న 'వివా' కప్పు టీపాయ్‌మీద పెట్టేస్తూ అన్నాడు.

"నాకేం వింతగాలేదు. మీరు వస్తారని నాకు తెల్సు. ఇంక బావుండటం సంగతి కొస్తే అలాటివన్నీ చదువుకొని లోకజ్ఞానం లేని బ్రూట్స్ ఆలోచనలు, మళ్ళీ చిరునవ్వులు చిందించేడు.

ఈసారి విస్తుపోవడం మాలతి వంతు అయింది. "నేను వస్తానని ఇతనికెలా తెల్సు !" అనుకుంది. అయినా గుంభనగా కూర్చుంది.

"చూస్తూ ఉండండి...ఇప్పుడే వస్తాను" వీక్లీ మాలతికి అందించి కిచన్‌వేపు నడిచేడు. మాలతి పత్రిక తిరగేస్తోందేకాని రకరకాల ఆలోచనలు పరుగులుపెట్టేయి. "ఏమనుకుంటున్నాడితను ... "

సెగలు కక్కే "వివా" రెండు కప్పుల్తో తెచ్చి ఒకటి మాలతికి అందించి ఒకటి తను ఉంచుకుని కుర్చీలో కూర్చుంటూ చల్లారిపోయిన "వివా" కప్పు టీపాయ్‌మీద దూరంగా జరిపేసేడు మోహన్.

"చెప్పండి" అన్నాడు సిప్‌చేస్తూ.

"నేను వస్తానని మీకు ముందే తెలుసన్నారుగా ! దేనికి వస్తానో కూడా తెలిసే ఉండాలి" అందామె కవ్విస్తూ.

"మీ రాధ నాకు బాగా నచ్చింది. మీ సాంప్రదాయం మాకు సరిపోతుంది ... మీ మామగారి ఆదరణ బాగుంది" ఇంకా ఏదో చెప్పబోయేడు మోహన్.


"కానీ ... నేను మీతో ఒక ముఖ్య విషయం మాటాడాలని వచ్చేను" మాలతి సగంలో అడ్డుపడింది.


"నేనూ మీతో ఒక ముఖ్య విషయమే మాటాడాలనుకుంటున్నాను" అన్నాడతను.

"మీ వయస్సెంత అని అడగకూడదేమో ! రాధకింకా ఇరవై నిండలేదు" మాలతి ఏం చెప్పాలో తోచక తికమకపడింది.

"నా వయస్సు ముప్ఫైరెండు. రాధ నాకంటే పన్నెండేళ్ళు చిన్నది. లేత తమలపాకులా... మీగడ తరగలా ... "

ఆ మాటమీద మాలతి సీరియస్సయిపోయింది. "మా మామయ్య అనుకునేదానికి



తిరుగుండదు. మా మరుదులెవరూ ఆయనని కాదనరు. అందుకే ఇట్నుంచి నరుక్కొచ్చామని మీతో మాట్లాడటానికి వచ్చేరు'' మాలతి చాలా చాలా విషయాలు చెప్పింది. ఓపిగ్గా విన్నాడు మోహన్. అతనూ కొన్ని విషయాలు చెప్పేడు. ఆమె కూడా జాగ్రత్తగా ఆలకించింది. ఇద్దరూ కొంచెంసేపు సీరియస్‌గా ఆలోచించేరు. మరి కొంచెం తడవు ఆర్గ్యుమెంట్సు, కౌంటర్ ఆర్గ్యుమెంట్సయ్యేయి. చాలా రాత్రి అయ్యేక ఇక వెడతానంటూ లేచిందామె, సాగనంపుతూ గేటు దగ్గర నిలబడి —

''సాయం రమ్మంటారా !'' అన్నాడు మోహన్.

''అవసరంలేదు. కాని మీరు బాగా ఆలోచించి మరీ నిర్ణయం తీసుకోండి. రాధ చాలా అమాయకురాలు ! నా ప్రాణంలో ప్రాణం'' అందామె.

''ఇందులో నేను త్యాగంచేస్తున్నదేంలేదు. అంతా నా స్వార్థమే, పోతే ... రాధ ... రాధ తరఫున మీరు ఆలోచించి నాకు చెప్పండి అయామ్ ఎట్ యువర్ డిస్పోజల్'' మాలతి కళ్లలోకి ''డీప్‌గా'' చూస్తూ అన్నాడతను.

క్షణంపాటు అలాగే చూస్తూ నిలబడి వెన్నెలలో రాజహంసలా నడుచుకుంటూ వెళ్లిపోయింది మాలతి.

* * *

రాత్రంతా నిద్రపట్టలేదు మోహన్‌కి. కలవరింతలూ పులకరింతలూను. ఏమేమిటో ఆలోచనలు, మనసు వశంతప్పింది. రెండు మూడుసార్లు లేచి మంచం మీద నిటారుగా కూర్చున్నాడు. చివరకి ఏదైనా చదివితే నిద్ర పడుతుందేమోనని, కిషన్ చందర్ రాసిన ''ఔంజెడ్ లవర్స్'' చేతపట్టేడు.

* * *

తర్వాత రెండురోజులు మౌనంగా ఉండి పోయిన రఘు ఎక్కువగా మోహన్ని పలకరించ లేదు. ముభావంగానే తన పని చూసుకుని తను ఇంటికి వెళ్లిపోతూ వచ్చేడు. ఒకనాడు మోహన్ బలవంతం చేసేడు.

''రావయ్యా నాతో రఘూ అలకమాని'' అని !...

రఘు సరేనన్నాడు !

చెస్ ఆడుతూ ఆడుతూ సడెన్‌గా ప్రశ్నించాడు రఘుని మోహన్ ''సుబ్బరామయ్య గారింటికి వెడదాం వస్తావా...'' దూసుకుంటూ వచ్చింది అతన్ని జవాబు.

''నేను రాను...''

'' ఏం ? ''

''ఏంలేదు. నాకు సుబ్బరామయ్యగారేగా ఉద్యోగం వేయించింది...''

''అయితే !''

''నేను వాళ్లింటికి వెళ్లడం వాళ్ల రాధతో



మాట్లాడటం మా అమ్మ దృష్టిలో కృతఘ్నత...''

'' ఓహో ! '' అర్థం అయినట్లు తల పంకించేడు మోహన్.

''క్రూరమోహం ! ఇంకా అమ్మ కొంగు విడిచిపెట్టలేదు.'' అనుకున్నాడు.

''పర్లేదులే ! నాతో వస్తే ఎవరూ ఏమీ అనరు... వెడదామా.''

రఘు ఏం మాట్లాడలేదు. అతనికీ వెళ్లాలనే ఉంది. కాని ఆభిజాత్యం అడ్డొస్తోంది. పైగా మోహన్ రాధని చేసుకుంటాడేమో ! అలాంటప్పుడు వాళ్లిద్దరూ పలకరించుకున్నా మాట్లాడుకున్నా తనక్కడ ఉండటం భావ్యం కాదేమో !...

రఘు మౌనం నచ్చలేదు మోహన్‌కి. అతని ఆలోచనలు ప్రక్కదారి పట్టిస్తూ అడిగేడు.

''తీసేసెయ్ .... !!''

నేస్తం ! ...
నీ మనో వల్మీకంలో ...
బుసలుకొట్టే ...
కోర్కెల విషనాగుల ...
కోరల్ని — తీసేసెయ్ ... !!!
లేకుంటే ...
నిన్ను కాటేస్తాయి !!
నిన్నంతం చేస్తాయి !!!

— ''సాయిబాబ''

''సుబ్బరామయ్యగారు కోడల్ని బాగానే చూస్తారు కదూ ! పాపం ఆమెమీద జాలి అనుకుంటా ! ఆవిడకి ఎక్కువ అధికారం గౌరవం ఇస్తారల్లే ఉంది...''

''బాగా చూడకేంచేస్తారు ! ఆయనదంతా మాలతిగారి పదెకరాల కొబ్బరితోటమీదున్న అభిమానమే. అమలాపురం వెళ్లిపోకుండా మచ్చికచేసి ఆవిడ్నక్కడే ఉంచేస్తే ఆస్తి బయటకి పోదని ఆయన ఆశ...''

సుబ్బరామయ్యగారి మాటెత్తితే చాలు చిరాకుపడుతున్నాడు రఘు. అతన్నింకా యింకా ఉడికించాలనిపించింది మోహన్‌కి.

''ప్రతీదానికీ పెడర్థాలు తీస్తావేం ! అలా అనుకోకపోతే ఆవిడకి వచ్చిన కష్టానికి ఆయన కన్నతండ్రిలా గుండెలో పెట్టుకుని కాపాడుతున్నా డనుకోకూడదూ...'' రఘు ఫీలింగ్స్ పరిశీలించేడు మోహన్.

''నా బొంద! ఆయనకి నిజంగా ఆవిడమీద అభిమానం, జాలీ ఉంటే రెండో పెళ్లి చెయ్యకూడదూ. తన సొంత కూతురు రాధ కోసమయితే ఇంజనీర్ని వెతుకుతున్నాడు. కోడలు బ్రతుకు మోడు అయిపోయినా ఆయనకేం బాధ ! అయినా రాధ కిప్పుడే పెళ్లి తొందరేమిటీ...''

అమ్మ చంటీ... ఎంతలేసి ఆలోచన లున్నాయి నీ మనసులో !

''సర్లే! రా నాతో—వెడదాం వాళ్ళింటికి..''

ఏమనుకున్నాడో రఘు... లేచాడు.

* * *

మోహన్‌ని చూసి చాటంత మొహం చేసుకున్న సుబ్బరామయ్యగారు—రఘుని చూసి మొహం చిట్లించుకోబోయి మోహన్ ఏమయినా అనుకుంటాడేమోనని మానేసేరు.

''రావయ్యా, నేనలా అరగంటసేపు సైట్‌మీదకి వెడుతున్నాను. ఇంట్లో పిల్లలున్నార్లే ! మాట్లాడుతూ ఉండు వచ్చేస్తాను'' అన్నారు జీపెక్కుతూ.

''పరవాలేదులెండి,రాధతోమాట్లాడతాను''

సుబ్బరామయ్యగారి మొహం మళ్లీ చాటంతయింది.

''ఆహా ! అలాగే, విత్ ప్లెజర్ ! కానీ !'' జీప్ తుర్రుమంది.

తర్వాత చాలాసేపు మోహన్ రఘు అక్కడే ఉన్నారు. ఇంట్లో రాధ, మాలతి వినహాయిస్తే సుబ్బరామయ్యగారి రోగిష్టిభార్య ఎక్కడోమూల గదిలో మూలుగుతూ పడుకుని ఉంది.

చాలాసేపు నలుగురూ కబుర్లు చెప్పుకున్నారు. నవ్వుకున్నారు. కేరమ్స్ ఆడేరు.

ఆటు తర్వాత మోహన్ సుబ్బరామయ్య గారింటికి రాకపోకలు హెచ్చించేడు. పెళ్ళి కెడుతూ పిల్లిని వెంట తెచ్చినట్లుగా ప్రతిసారీ రఘుని వెంట పెట్టుకుని మరీ వస్తాడేమిటని ఆయన కొంచెం చిరాకువేసినా ...

''వీళ్ళమ్మ నాకు దూరపు చుట్టమండీ ! అత్త అవుతుంది'' అని మోహన్ చెప్పేక చేసేది లేక ఊరుకున్నాడు.

పదిహేను రోజుల తర్వాత సుబ్బరామయ్య గారు విషయం మళ్లీ మొదలకించేరు.

''నీ ఆలోచనేమిటో చెప్పేవుకాదు. నెలా పదిహేను రోజుల్లో ముహూర్తాలున్నాయి మరి''... అర్థోక్తిలో ఆగిపోయేరు.

అన్నీ బాగానే ఉన్నాయి కాని రాధకూ నాకూ పదేళ్ల పైన వయస్సు తేడా ఉంది. జనరేషన్ గాప్ ఎక్కువయి తర్వాత కష్టం అవుతుందేమోననీ... నసిగేడు మోహన్.

''మంచి వాడివిలే ! ఆ మాత్రం వయసు తేడా అబ్బురమేముందీ ! నాకూ మా ఆవిడకీ పద్నాలుగేళ్ళు తేడా ఉంది. రేపు ఒకరిద్దరు పిల్లలు పుడితే రాధ పెద్దదానిలాగా అయిపోతుంది. నువ్విలాగే యూత్ ఫుల్‌గా ఉంటావు...''

నవ్వేడు మోహన్.

''ముద్దు ముచ్చట్లు లాంఛనాలూ లోటుం

డవున్సీ!'' మోహన్ ఆదర్శాలు అర్థం చేసుకున్న సుబ్బరామయ్య కట్నం మాటెత్తలేదు, కంయ్ మంటాడని భయపడి ...

"ఆ విషయాల్లో నాకేం భయంలేదు లెండి. అయామ్ నాట్ ఫర్ సచ్ థింగ్స్! ... మా పెద్దన్నయ్య బ్యాంక్ ఏజెంట్ ... మీకు తెల్సుగా, ఆదేదో స్టాఫ్ ట్రైనింగు సెంటర్‌కి డిప్యుటేషన్ మీద వెళ్లాడని. ఫస్టు దాటితేనే కాని రాడు. ఆ తర్వాత మీరు ప్రొసీడ్ అవుదుర్గాండి ..."

సుబ్బరామయ్యగార్కి మోహన్ మాటలు నచ్చినట్లున్నాయి. తృప్తిగా బొజ్జ తడుముకున్నాడు.

"అలాగే చేద్దాం! ముహూర్తాలు ఒక్క పదిహేను రోజులున్నాయనగా నాకు చెబితే చాలు. హ హ హ ..."

"హ హ హ...''మోహన్ ఆయన నవ్వుతో శృతి కలిపేడు. అయితే ఆ తర్వాత మోహన్ పెట్టిన ప్రపోజల్ మాత్రం సుబ్బరామయ్యగార్ని కొంచెం ఇబ్బంది పెట్టింది.

"రాధ నన్ను అర్థం చేసుకోవాలి! ఆమెకి నామీద ఎలాంటి అభిప్రాయం ఏర్పడిందో తెల్సుకుంటే 'ఇహ' నా అడ్డేమీ ఉండదు రేపు ఆదివారం "కప్పల ఏరు" జలపాతానికి పిక్‌నిక్ వెడదామని ఉంది! నాతో పంపిస్తారా!"

"ఇదేం గొడవ!... అది సాంప్రదాయమేనా? ఆడపిల్లని పిక్‌నిక్‌లకి దానికీ తిప్పి తర్వాత కాదంటే! మోహన్ అలాంటి వాడు కాదేమో! కాదంటే తర్వాత బ్రతగ్గలడా! దుంప తెంపెయ్యనూ ...

"సరే... అలాగే కానీ.. దానికేం భాగ్యం. జీప్ ఎరేంజ్ చెయ్యమంటావా!". "

* * *

కప్పలేరు జలపాతం పుంచి నట్టడవిలో ఉంది! ఎందుకయినా మంచిదని మాలతని వెంట వెళ్లమని బలవంతం చేసేరు అత్తామామలు

మోహన్...రఘు...మాలతి. రాధ. జీప్ డ్రైవర్ ఆ రోజంతా సరదాగా గడిపేసేరు రఘు, రాధ . కోతిపిల్లల్లాగా చెట్లెక్కి దూకి గంతులేసేరు. మాలతి మోహన్ మర్రిచెట్టు క్రింద కూర్చుని ఏమిటేమిటో కబుర్లు చెప్పెసుకుంటూ ఉద్రిక్తంగా పడుతున్న జలపాతం చూసేరు జీప్ డ్రైవర్.. అతని కడుపుతో ఉన్న భార్య మనసు పడిందంటూ కణుజు పిట్టల్ని కొట్టడానికి అడవి లోకంటూ వెళ్లిపోయేడు.

భోజనాల టయిమ్‌కి రాధ కారియర్లు విప్పి పులిహోర వడ్డించింది గులాబ్‌జాం కప్పుల్లో వేసి అందించింది. 'టీ' టయిమ్‌లో మాలతి స్టౌ వెలిగించి 'టీ' చేసింది. అందరూ హాయిగా తాగేరు. పేకాట ఆడేరు, కేరమ్స్ ఆడేరు. పరుగుపందేలు వేసేరు. పాటలు పాడేరు. డిస్కో చేసేరు. కణుజుపిట్టల్ని భద్రంగా దాచుకుని డ్రైవర్ కూడా అన్నిట్లోనూ సరదాగా పాల్గొన్నాడు. రాధ మొహం కడుక్కోబోయి పాకుడు కట్టిన రాయి జారి సెలయేట్లో ఎడడం మినహా అవాంఛనీయమయిన సంఘటన లేమీ జరగలేదు.

రాధ జారిపడింది. నీరు వేగంగా ప్రవహిస్తోంది. నాలుగైదు అడుగుల దూరం రాధని తోసేసింది. "బాబోయ్ బాబోయ్" అరిచింది రాధ. రఘు తత్తర పడిపోయేడు. మాలతి బిక్కమొహం పెట్టింది. మోహన్ సినిమా హీరోలా నీళ్లలో దూకేడు. క్షణంలో రాధని రెండు చేతుల మీద వేసుకుని ఒడ్డెక్కేడు.

రాధ ఖంగారు పడింది. కాని పెద్ద ప్రమాదం ఏమీ జరగలేదు. మాలతి ముందు జాగ్రత్తలో ఉండి చీరలు తెచ్చింది. కాబట్టి రాధ కొండ వెనక్కి వెళ్లిపోయి మార్చుకుంది పాపం మోహన్! రఘు తెచ్చిన లుంగీ కట్టుకుని తిరిగేడు, డ్రైవర్ బట్టలు ఆరబెట్టి తెచ్చేవరకూ! కాని చీకటి పడేవేళకి నవ్వుతూ, తుళ్ళుతూ జీపెక్కేరు. రఘు చెవిలో రహస్యంగా "ముప్ఫై మూడేళ్ల వయస్సులో నా జీవితంలో ఇదే మొదటిసారి 'లేడీ'ని చూసి నా హృదయం స్పందించడం" అన్నాడు అర్థవంతంగా మోహన్.

* * *

మరి నాల్గు రోజుల తర్వాత మోహన్ దగ్గర్లో ఉన్న చిన్న తిరుపతి దేవస్థానం చూడ్డానికి వెడతాను రాధని పంపమని అడిగేడు. సుబ్బరామయ్యగారు "నిరాక్షేపణీయంగా" ఆహాలు అన్నారు. మాలతిని ఎస్కార్టు బయల్దేరమన్నారు.

ఈసారి రఘుతోపాటు అతని ఎల్జీసీ కొలీగ్ ప్రకాష్, మోహన్‌తోపాటు అతని జేయూ కొలీగ్ శంకర్ బయల్దేరేరు. జీప్ డ్రైవర్ నూకరాజు, అతని ఫ్రెండ్ అటెండర్ అప్పలకొండ.

జీప్‌లో అందరూ ఇరుక్కునిపోయి కూర్చున్నారు. మధ్యలో పళ్లు, పువ్వులు, కొబ్బరికాయలు, ఇతర పూజాద్రవ్యాలు ఉన్న గంప... ముడుపులు వగైరాలున్న చిన్న బ్రీఫ్‌కేసు... తెల్లవారుజామున, నాలుగున్నరకి 'శుశ్రూష' ముందు బయల్దేరిన జీప్ చిన్నతిరుపతి చేరేసరికి "ఆరు" అయింది. పూజాదికములు ముగించి కార్యక్రమావళి పూర్తిచేసుకుని పదకొండో గంటకల్లా జనం "గెస్టుహౌస్" చేరేరు.

మరో పది నిముషాల తర్వాత మాలతి ట్రంక్‌కాల్ బుక్ చేసింది. ఒంటిగంటకి లైన్ దొరికింది. సుబ్బరామయ్యగారే రిసీవర్ ఎత్తేరు

"హలో ... మామయ్యా! నేనుమాలతిని! మాట్లాడుతున్నాను. రాధ మనసు నీకు తెల్సుగా, అది నాకు బహిః ప్రాణమనికూడా తెల్సు, అది ఏడిస్తే నా గుండె పగిలిపోతుంది మామయ్యా, హలో... హలో... మామయ్యా! వింటున్నావా!

అందుకే నీకు తెలియకుండా. . మోహన్ గారి సహాయంతో... రాధనీ — రఘునీ వివాహ బంధంలో ముడి వేసేసేం ఈ ఉదయం ఎనిమిది గంటల నలభై అయిదు నిముషాలకి.. శ్రీశ్రీ పద్మావతీ వెంకటేశ్వరుల సమక్షంలో — హల్లో .. ప్లీజ్... అర్థంచేసుకో మామయ్యా.. అదే ముహూర్తానికి నేనూ మోహన్‌గారూ పెళ్లి చేసుకున్నాం. రాధ ఎల్.డి.సి.ని చేసుకుందని బాధపడకు మామయ్యా! నా ఆస్తిలో సరిగ్గా సగం దానిపేర రిజిష్టర్ చేయించేసేను.

ఇహ ఏముంది! సినిమాల్లో విలన్ ఫాదరిన్లా లాగా నువ్వు తుపాకి పట్టుకుని గుమ్మంలో నిలబడతానంటే . ఇంటికి రానేరాం. సరాసరి మోహన్‌గారింటికే .. సారీ . మా యింటికే వెళ్లి పోతాం ... అక్కణ్నుంచి నేనే రాధని అత్తవారింటికి పంపుతాను. హలో మామయ్యా . హలో ... "

రెండు నిముషాల తర్వాత సుబ్బరామయ్యగారి గొంతు విన్పించింది.

"వెల్‌డన్! మనింటికే వచ్చెయ్యండి నేను 'రిసెప్షన్' ఏర్పాట్లు చేస్తాను."

ఆయన గొంతు కొద్దిగా వణికింది కాని ప్రేమ గెలిచింది. మోళ్ళ చిగిర్చేయి మంచి మనసు పరవళ్లు తొక్కింది. ★

